చంద్రబాబుకు జ్యోతుల నవీన్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - గండేపల్లి : 2024 సార్వత్రిక ఎన్నికల్లో చరిత్రలో నిలిచిపోయే విజయాన్ని అందుకున్న టిడిపి అధినేత చంద్రబాబుకు ఉండవల్లిలో చంద్రబాబు నివాసంలో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక చరిత్ర సృష్టించిన కూటమి విజయం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కష్టం ఎంతో ఉందని ఒక నియంతపై పోరాడి గెలిచిన వ్యక్తులని ఈ రాష్ట్ర ప్రజలందరూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటు ఎదురుచూస్తున్నారని నవీన్ తెలిపారు. అనంతరం తన తండ్రి జ్యోతుల నెహ్రూ విజయం కోసం కష్టపడి పనిచేసిన నవీన్‌ను చంద్రబాబు అభినందించారు.

ప్రజా సమస్యలపై పోరాడుతా...

-బీఎస్పీ ఇన్‌చార్జీ జుత్తుక

విశాలాంధ్ర - జగ్గంపేట : ఎన్నికల్లో గెలిచినా ఓటమి పాలైన ప్రజలతోనే నా ప్రయాణమని, ప్రజా సమస్యలపై పోరాడుతూ ఉంటానని బహుజన సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరావు అన్నారు. గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెలువడిన నేపథ్యంలో జగ్గంపేట మం డలం రామవరం వద్ద తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ డబ్బు, మద్యం పంచకపోయినా నాపై ఉన్న నమ్మకంతో 696 ఓట్లు వేశారన్నారు. అందుకు జగ్గం పేట నియోజకవర్గం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే అత్యధిక మెజారిటీతో గెలిచిన తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, జగ్గంపేట ఎమ్మెల్యేగా గెలిచిన జ్యోతుల నెహ్రూ కు అభినందనలు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఇరువురు జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ, నియోజకవర్గ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.

నెహ్రు ఇంటా కోలాహలం

జిల్లాలోని పలువురు నేతల సత్కారం

విశాలాంధ్ర - జగ్గంపేట : తెలుగుదేశం పార్టీ తరుపున జగ్గం పేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందిన జ్యోతుల నెహ్రు గెలిపొందడంతో ఆయన ఇంటా, పార్టీ కార్యాలయం కోలాహలంగా మారింది. జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు గురువారం ఆయనను కలిసి అభినందించేందుకు రావడంతో జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని ఆయన ఇల్లు, స్థానిక పార్టీ కార్యాలయం వారితో కిక్కిరిసాయి. నెహ్రూను కలిసి ఘనంగా సత్కరించిన వారిలో బిజెపి జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్, జగ్గంపేట నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ దాట్ల కృష్ణ వర్మ, జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్, జనసైనికులు ఉన్నారు. అలాగే నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీల నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ రికార్డు మెజార్టీతో గెలుపొందరాన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్. రాగంపేట కందుల చిట్టిబాబు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట.మంగారాజు, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు బాలిన వేంకటేశ్వర రావు, స్టేట్ ఎస్సీ సెల్ సెక్రటరీ పేదూరి యుగంధర్, టీడీపీ నాయకులు కొర్పు లచ్చయ్యదొర, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్‌కు జనసైనికుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర - గండేపల్లి : ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్యమైన జనసేన 2024 సాధారణ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడంతో గండేపల్లి మండల జనసైనికులు జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందులో భాగంగా మల్లేపల్లి గ్రామ జనసైనికులు తుమ్మలపల్లి రమేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్డీఏ కూటమి జనసేన కాకినాడ పార్లమెంటు అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ 1,48,775 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి చలమలశెట్టి సునీల్ పై గెలుపొందారు. జనసేన పార్టీకి ఇంతటి ఘన విజయాన్ని అందించిన కాకినాడ పార్లమెంట్ పరిధి ప్రజలకు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, తుమ్మలపల్లి రమేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ఇది ప్రజా విజయం అని, 2024 ఎన్నికల్లో ప్రజలు గెలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ కోఆర్డినేటర్ రామకుర్తి నరసింహం, జనసేన నాయకులు బలిరెడ్డి గణేష్, పంచికట్ల సత్యనారాయణ, బత్తుల కాపు, పితాని వీరబాబు మరియు మల్లేపల్లి గ్రామ జనసైనికులు పాల్గొన్నారు.

రత్తాలమ్మని దర్శించుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెదపూడి : అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వేంద్రలో రత్తాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రత్తాలమ్మ అమ్మ జాతర మహోత్సవం పురస్కరించుకుని ఎమ్మెల్యే నల్లమిల్లి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఇక్కడకు విచ్చేసిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని కూటమి నేతలు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా ఎన్‌డిఏ నాయకులు, కార్యకర్తలు గొల్లల మామిడాడ జై నారాయణ దేవస్థానంలో స్వామి వారికి మొక్కుకున్న మొక్కు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తీర్చారు.

సత్తిబాబు రాజుకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - అల్లవరం : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర తెలుగు దేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అఖండ విజయం సాధించినందుకు అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్, ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అఖండ విజయం సాధించినందుకు తమ గ్రామ టీడీపీ నాయకులు కష్టబడి పని చేసిన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేసారు. పార్టీ విజయానికి కృషి చేసిన అల్లవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దెందుకూరి సత్యనారా యణరాజుని స్వగృహం వద్ద కలిసి వారు తెలుగుదేశం పార్టీ విజయం కోసం తమకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించినందుకు వారిని దుస్సాలువాతో సత్క రించి గ్రామస్తులను పరిచయం చేశారు. ఈ కార్యక్ర మంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ముప్పిడి

విశాలాంధ్ర - కొవ్వూరు : ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఆంధ్ర సుగర్స్ జాయింట్ మేనేజ్ అండ్ డైరెక్టర్, టిడిపి సీనియర్ నాయకులు పెండ్యాల అచ్యుత రామయ్య (అచ్చి బాబు) కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలదగ్గ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, ఆళ్ళ హరిబాబు ముప్పిడి ధరన్ తదితరులు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కొవ్వూరు టీడీపీ కంచుకోటను తిరిగి నిలబెట్టారని అంతే కాకుండా భారీ మెజార్టీతో గెలిపించారని ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు అందరికీ అభినందనలు తెలియ చేస్తున్నానని చంద్రబాబు తెలిపారు.

సమన్వయంతో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతం

- లా అండ్ ఆర్డర్ సమస్య లేకుండా పోలీస్, రెవెన్యూ, జిల్లా యంత్రాంగం సంయుక్త కార్యచరణ
- ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్ర అభినందనీయం ..
- బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన వారందరికీ ధన్యవాదములు
- జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు 2024 సందర్భంలో పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు కౌంటింగ్ ప్రక్రియ వరకు అధికారులు, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదములు తెలియ జేస్తున్నానని జిల్లా కలెక్టర్ డా. కే. మాధవీలత తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలు -2024 జిల్లాలో విజయ వంతంగా నిర్వహించిన సందర్భంలో రిటర్నింగ్ అధికారులు, జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డా. కే. మాధవీలత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక -2024లకు సంబంధించి మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ ప్రారంభం మార్చి 16 నుంచి ఎన్నికల విధులు నిర్వహించిన రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు వారి సిబ్బంది ఎంతో నిబద్ధతతో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించిన ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించడం ద్వారా వారు ప్రదర్శించిన పనితీరును ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నేపధ్యంలో జిల్లాలో ప్రింటు అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పోషించిన పాత్ర ఎన్నికలను సజావుగా సాగేందుకు ఉపయోగ పడిందని అన్నారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణ లో భాగంగా విలువైన సూచనలు సలహాలు ఇచ్చిన ఎన్నికల అబ్జర్వర్ల, ఖర్చుల పరిశీలకులు, కౌంటింగ్ పరిశీలకులు అందించిన సూచనలు, సలహాలు పట్ల కలెక్టర్ ధన్యవాదములు తెలియజేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులు ఉంటాయని వాటినీ దృష్టిలో పెట్టుకొని మరింతగా నిఘా పెట్టాలని నిర్ణయించారన్నారు. ఈ నేపధ్యంలో జిల్లాలో పోలింగ్ రోజున, కౌంటింగ్ సమయంలో పోలీస్ మరియు జిల్లా యంత్రాంగం ఎటువంటి లా అండ్ ఆర్డర్ సమస్యల తలెత్తకుండా చాకచక్యంగా విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, కేంద్ర బలగాలు, పోలీసులు, ఆర్మ్ ఫోర్సెస్, భద్రత సిబ్బంది, జిల్లా స్థాయి అధికారి నుంచి దిగువ స్థాయి సిబ్బంది, వరకూ, నన్నయ్య యూనివర్సిటీ యంత్రాంగం సహకారం, అందరూ ఎంతో నిబద్ధతతో విధులను నిర్వహించారన్నారు.

జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించిన జిల్లా ఎస్పీ జగదీష్ , ఇతర పోలీస్ అధికారులను, సిబ్బంది కేంద్ర బలగాల సేవలను కలెక్టర్ పేరు పేరునా ప్రశం సించారు. అదే విధంగా ఓట్లలెక్కింపు కార్యక్ర మం ప్రశాంతంగా నిర్వహంచడంలో సహకరించిన రాజకీయ ప్రతినిధులు, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్స్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల తోడ్పాటు కు కలెక్టర్ ధన్య వాదాలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని విధాలా సహకరించిన జిల్లా ప్రజలకు, రెవిన్యూ శాఖాధికారులు, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, సూపర్ వైజర్లు, సహాయకులు , మైక్రో అబ్జర్వర్లు, పోలీసులు, నిఘా స్కాడ్స్, సెక్టార్ అధికారులు, కేంద్ర బలగాలు, జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, యంపిడివోలు, తదితరులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం ఫలితాలు ప్రకటన చెయడంలో జాయింట్ కలెక్టర్ రూరల్ ఆర్వో ఎస్. తేజ్‌భరత్ , అదే విధంగా రాజమండ్రి పార్లమెంట్ రిజల్ట్ ప్రకటన విడుదల చెయ్యడంలో అందరి ఆర్వోల పనితీరును కలెక్టర్, ఆర్వో జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అభినందించారు. రిజల్ట్స్ ప్రకటించి విజేతలయిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రాష్ట్రంలో తొలి ఎన్నికల ఫలితం వెలువడిన రాజమండ్రీ రూరల్ అసెంబ్లి నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎస్ తేజ్‌భరత్, వారిని టీమ్‌ను కలెక్టర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ఫలితాలు ప్రకటనలో టీమ్ తూర్పు గోదావరి జిల్లా ప్రప్రథమ స్థానంలో నిలిచిన ఒక పార్లమెంటు ఏడు అసెంబ్లి నియోజకవర్గాల ఫలితాలు ప్రకటన చెయడం మనందరికీ సమిష్టి కృషికి నిదర్శనంగా మాధవీలత తెలియచేశారు.

జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్ మాట్లాడుతూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. మాధవీలత ఎప్పటి కప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలు సమ యా నికి సూచనలు అందించడంతో ఎన్నికల ప్రక్రి యను పోలింగ్ నుంచి కౌంటింగ్ అయ్యేం తవరకు సజావుగా నిర్వహించడం సాధ్యం అయిందని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు, కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి సూచ నలు మేరకు ఎన్నికలు నిర్వహణలో ఎటువంటి తప్పులు లేకుండా చేయడం జరిగిందన్నారు. టీమ్ లీడర్‌గా సరైన మార్గదర్శకం వల్ల మాత్రమే ఇది సాధ్యం అయిందని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్‌భరత్, కమీషనర్ కే. దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ జి. నరసింహులు, రిటర్నింగ్ అధికారులు ఏ. చైత్ర వర్షిణి, కే ఎల్ శివ జ్యోతి, ఆర్ వి రమణ నాయక్, ఎమ్. మాధురి, జిల్లా అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బత్తుల బలరామ కృష్ణకు అభినందనలు

విశాలాంధ్ర - రాజానగరం, సీతానగరం : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సత్తా చాటి 34వేలపై చిలుకు మెజార్టీతో ఘన విజయం సొంతం చేసుకున్న బత్తుల బలరామ కృష్ణకు అభినందన వెల్లువలు పోటెత్తాయి. రాజమండ్రిలోని బత్తుల నివాసానికి రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలలైన రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల నుండి కూటమి నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల లీడర్లు, అధికారులు వరస కట్టారు. దీనిలో భాగంగా తాజా ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణను కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజానగరం ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీ సాధించడం హర్షణీయమన్నారు. గెలుపును సునసాయంగా కైవసం చేసుకున్న బత్తుల భళా అంటూ అభినందించారు. బలరామకృష్ణ మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు చెప్పారు.అధినేత పవన్ కళ్యాణ్ ఆశ యాలకు అనుగుణంగా ప్రజలకోసం పనిచేస్తామన్నారు.తన గెలుపుతో ఆనందాన్ని పంచుకోవడానికి విచ్చేస్తున్న నేతలకు, జనసైనికులు, కూటమి నేతలు, శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ నేతలు,నాయకులు భారీగా పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలుపుకుంటాను

గిడ్డి సత్యనారాయణ

విశాలాంధ్ర - పి గన్నవరం : తనను నమ్మి ఎన్డీఏ కూటమి నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసిన తనను గెలిపిం చిన పి గన్నవరం నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలుపుకుంటానని, నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్య నారాయణ అన్నారు. పి గన్నవరంలోని ఆయన క్యాంపు కార్యా లయం వద్దకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తాను జన్మించిన ప్రాంతానికి ఏదైనా చేయాలనే ఉద్దే శంతో రాజ కీయ మార్గాన్ని ఎంచుకున్న తనకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. తన గెలుపునకు అహర్నిశలు శ్రమించిన ఎన్‌డిఏ కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ జిల్లా మహిళ నాయకురాలు కడలి ఈశ్వరి, జిల్లా కార్యదర్శి మద్ద చంటిబాబు, సంయుక్త కార్యదర్శి కుమార్, మాజీ ఎంపీపీలు సలాది ఉంద్రాజవరపు శాంతి కుమారి, ఆదిమూలం సూర్యనారాయణ, పప్పుల సాయిబాబు, కొక్కిరి లక్ష్మి, పులపర్తి చిన వెంకటలక్ష్మి, సర్పంచులు యల్లమెల్లి కృష్ణవేణి, పసలపూడి రామకృష్ణ, పప్పుల శ్రీనివాస్, గుడాల రాముడు, ప్రత్తిపాటి ఉమామహేశ్వరి, వీర మహిళలు అడ్డగళ్ళ సిరి సతీష్, పి ఎసమ్మ, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు నిలుపుదల

కలెక్టర్ జె నివాస్

విశాలాంధ్ర - కాకినాడ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశాలు జారిచేసారని కాకినాడ జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 16వ తేదీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుండి అమల్లోకి వచ్చిన ఈ ప్రవర్తన నియమావళి జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసిన తదుపరి 48 గంటల వరకు అమల్లో ఉందన్నారు. ఎన్నికల్లో ఫలితాలు వెలువడినందున రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును నిలుపుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును నేటి సాయంత్రం నుండి నిలుపుదల చేసినట్లు సిఈఓ జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని కాకినాడ జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా..

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతా : ఎమ్మెల్యేదేవ

విశాలాంధ్ర - రాజోలు : తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా నియోజకవర్గంలో అడుగుపెట్టిన దేవకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మర్క్‌లో బస చేసిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు కలసి అభినందనలు తెలిపారు. శాలువాలు, పూల మాలలలతో సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ తనకు టికెట్ ఇచ్చి, ప్రోత్సహించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు, భారీమెజార్టీతో గెలిపించిన తెదేపా, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చుతానని అన్నారు. మంచినీటి సమస్య ఏటిగట్లు, కాలువలు, డ్రైన్‌లు, రోడ్లు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, సఖినేటిపల్లి, సర్సాపురం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, కోనసీమలో రైల్వే నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. తన 35 ఏళ్ల ఐఏఎస్ సర్వీసును పరిపాలన విభాగంలో అనుభవాన్ని రాజకీయ రంగంలో మేళవించి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే దేవ అన్నారు. గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, ఉండపల్లి అంజి, అడబాల సాయిబాబు, విప్పర్తి సాయిబాబు, మొల్లేటి నాగరాజు, కత్తుల శ్రీను, సుందర బుల్లబ్బాయి, సుందర రావు, అనుసూరి పురుషోత్తం, పినిశెట్టి బుజ్జి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులను ఆదుకోవాలి : జొడాల

విశాలాంధ్ర- తాళ్లపూడి: ఉపాధ్యాయ, ఉద్యోగుల పక్షాన నూతన ప్రభుత్వానికి నూతన రధ సారథులు చంద్రబాబు నాయుడు , పవన్ కళ్యాణ్ లకు హృదయ పూర్వక స్వాగతం మరియు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉద్యోగులు ప్రభుత్వం లో భాగంగా గుర్తించాలని జొడాల పేర్కొన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులు గా మా ప్రయాణం ఉంటుందని ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే అదే మా ప్రభుత్వం, మా సంక్షేమం అన్నారు. గత 5 సంవత్సరాలలో ఉద్యోగ ఉపాధ్యాయుల పై పెట్టిన కేసులు మొత్తం వెంటనే రద్దు చేయాలని, విది నిర్వహణలో మరియు ఎన్నికల విదులలో సస్పెండ్ కాబడిన ప్రతీ ఉద్యోగిని మరల ఉద్యోగం లోకి తీసుకోవాలన్నారు. ప్రతీ నెల 1వ తేదీ జీతం, 6నెలలకు ఒక కరువు భత్యం, సంవత్సరానికి ఒక ఇంక్రిమెంట్, 5 సంవత్సరాలకు మెరుగైన పి.ఆర్.సి, దాచుకున్న ఏపీజీ యల్ఐ, జిపియఫ్ లను చెల్లించాలి, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగికి అదే రోజు అంతా అమౌంట్ క్లియర్ చేయాలని కోరారు. జే.ఏ.సి గోపాల పురం చైర్మన్, తూర్పు గోదావరి జిల్లా సిపియస్ ఉద్యోగుల సంఘం అధ్య క్షులు జోడాల వేంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలియజేస్తూ నూతన ప్రభుత్వా నికి తమ కోరికలు విన్నవిస్తూ అభినం దనలు తెలిపారు. ప్రతీ నియోజక వర్గ శాసన సభ్యులను కలిసి మా ఉద్యోగుల అందరి తరుపున అభినందనలు తెలపనున్నట్లు పేర్కొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

వివాదాస్పద పోస్టులు పెడితే ఉపేక్షించం

- జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్ హెచ్చరిక

విశాలాంధ్ర - అమలాపురం : ఉప్పలగుప్తం మండలం, చల్లపల్లి గ్రామానికి చెందిన వరసాల ముత్యాల రావు అనే వ్యక్తి వాట్సాప్/సోషల్ మీడియాలో వర్గాలను రెచ్చగొట్టే విధంగా వాయిస్ మెసేజ్ పెట్టిడంతో ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ముద్దాయిని అరెస్ట్ చేశామన్నారు. వివాదాస్పద పోస్టలను ఫార్వర్డ్ చెయ్యడం కూడా నేరమే. ఈ కేసులో ఈ పోస్ట్‌ను ఫార్వర్డ్ చేసిన వ్యక్తులను కూడా గుర్తించి అరెస్ట్ చెయడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియాలో కులాల మధ్యలో గొడవలు రెచ్చగొట్టేలా ఈ విధమైన సంఘటనలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎవరైనా వాట్సాప్ గ్రూప్లో/సోషల్ మీడియాలో కులాల మధ్యలో గొడవలు వచ్చేలా మెసేజ్లు పెడితే గ్రూప్ అడ్మిన్ ఆ మెసేజ్‌ను వాట్సాప్ గ్రూప్లో వెంటనే డిలీట్ చేసి ఆ వ్యక్తిని వెంటనే వాట్సాప్ గ్రూప్ నుండి తొలగించాలన్నారు. అలా చెయ్యని అడ్మిన్ మీద కూడా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీధర్ అన్నారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంటుందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

నేడు, రేపు యుక్త శస్త్రచికిత్స విద్యాకోర్సు

- వైద్యులు,బావి వైద్యులు సద్వినియోగం చేసుకోవాలి
- నిర్వహణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ గన్ని భాస్కరరావు

విశాలాంధ్ర - రాజానగరం : దేశంలోనే తొలిసారిగా తమ వైద్య కళాశాల నందు యుక్త శస్త్రచికిత్స విద్యాకోర్సును నిర్వహించేందుకు జీఎస్ఎల్ వైద్య కళాశాల సన్నద్ధమైనట్లు జిఎస్ఎల్ విద్య సంస్థల అధినేత, సదస్సు నిర్వహణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ గన్ని భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాల నుండి పత్రిక ప్రకటనను గురువారం విడుదల చేశారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి ఫండమెంటల్ యూస్ ఆఫ్ సర్జికల్ ఎనర్జీ కోర్సును జూన్ 7,8 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.అమెరికన్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ , ఎండోస్కోపిక్ సర్జన్స్ సొసైటీ, యుఎస్ఏ ద్వారా ఆమోదించబడిన ఈ ప్రాథమిక కోర్సు లైఫ్ టైమ్ సర్టిఫికేట్ అందిస్తుందన్నారు. శిక్షణ తరగతులు అన్ని విభాగాల సర్జన్లకు,సర్జరీ పీజీ విద్యార్థులకు ఒక ముఖ్యమైన విద్యా అవకాశమని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 7,8 తేదీలలో ఉదయం 9:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడుతున్న కోర్సుల్లో శస్త్ర చికిత్సలో ఎనర్జీ ఆధారిత పరికరాల సురక్షిత వినియోగం పై ఐదుగురు అమెరికన్ సర్జన్లు సమగ్ర శిక్షణ అందిస్తారన్నారు. శిక్షణ పొందేవారు ఎలక్ట్రోసర్జరీ యొక్క ప్రాథమిక అంశాలు, ఆపరేటింగ్ రూమ్ అగ్నిప్రమాదాల వంటి ప్రతికూల సంఘటనలకు అవకాశాలు, నివారించే పద్ధతులు, వివిధ శస్త్ర చికిత్స విభాగాల్లో ఉపయోగించే ఎనర్జీ పరికరాల గురించి సమగ్ర అవగాహన పొందుతారన్నారు.శస్త్ర చికిత్స విద్యలో భారతదేశంలో ముఖ్యమైన పురోగతిగా నిలుస్తుంది, ఇది పాల్గొనే వారికి శస్త్ర చికిత్సలో ఎనర్జీ పరికరాల సురక్షిత వినియోగంపై తమ నైపుణ్యాలను మెరుగుపరచడానికి అవకాశాన్ని అందిస్తుందన్నారు. రోగుల ఫలితాలను మెరుగుపరిచి శస్త్ర చికిత్స రంగాన్ని అభివృద్ధి చేస్తుందని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో లిఫ్ట్ ఏర్పాటు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో నూత నంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను గురువారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగంలో వైద్య సేవలు పొందుతున్న రోగులు సౌకర్యం నిమిత్తం రూ. 29.85 లక్షలతో నూతనంగా లిఫ్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మూడు అంతస్తులుగా ఉన్న జనరల్ మెడిసిన్ విభాగంలో నిత్యం అనేక మంది వైద్య సేవలు పొందుతున్న రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె తెలిపారు. కాకినాడ జిల్లా గత కలెక్టర్ కృతికా శుక్లా సమయంలో ఈ లిఫ్ట్ మంజూరుకాగ, లిఫ్ట్ ఏర్పాటు పనులపై ప్రస్తుత కలెక్టర్ జె నివాస్ ప్రత్యేక దృష్టి తక్కువ సమయంలో లిఫ్ట్ అందుబాటులో తిసుకువచ్చేందుకు కృషి చేశారన్నారు. లిఫ్ట్‌ను వైద్య సేవలు పొందుతున్న రోగులు మాత్రమే వినియోగించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్ఎంవో డా అనిత, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

అ ధైర్యపడొద్దు ... పోలీస్ అండగా ఉంటుంది

పట్టణ సీఐ క్రిస్టోఫర్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పట్టణం మొత్తం పోలీసు బందోబస్తుతో నిండి ఉందని ఎవరూ అ ధైర్య పడవద్దని పట్టణ సీఐ క్రిస్టోఫర్ ప్రకలకు భరోసా ఇచ్చారు. గురువారం అమలాపురం ఎస్‌కెబిఆర్ కళాశాల నుంచి నల్ల వంతెన వరకు సిఐ ఎస్ఎఫ్, లోకల్ పోలీస్‌తో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం ప్రజలకు పూర్తి భరోసా ఇస్తుందని దైనందిన కార్యక్రమంలో స్వేచ్ఛగా ప్రజలు పాల్గొనవచ్చునని సీఐ క్రిస్టోఫర్ అన్నారు.

రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) 2.0 క్రింద జేఎన్‌టీయూకేకు 9పరిశోధనా ప్రాజెక్ట్‌లకు నిధులు

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) 2.0 క్రింద జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయానికి 9 పరిశోధనా ప్రాజెక్ట్‌లకు నిధులు విడుదలైనట్లు గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ. జీవీఆర్ ప్రసాదరాజు గురువారం తెలిపారు. జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయంలో పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా రీసెర్చ్ ప్రాజెక్ట్‌లకు రూసా నిధులు మంజూరయ్యాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రూసా ప్రాజెక్ట్ డైరెక్టరేట్‌కు జెఎన్‌టియుకె ద్వారా రూ.93లక్షల విలువైన 9 పరిశోధనా ప్రాజెక్ట్‌లకు వివరణాత్మక ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) నివేదించగా పరిశోధన, ఆవిష్కరణ, నాణ్యతా మెరుగుదలకు మొదటి విడతలో భాగంగా రూ.40,92,000/- నిధులు విడుదల కాగా ఇది మంజూరైన మొత్తంలో 44% నిధులుగా పేర్కొన్నారు. రీసెర్చ్ & ఇన్నోవేషన్ ప్రాజెక్ట్‌లకు సంబంధించి జెఎన్‌టియుకె యూనివర్సిటీకి మంజూరైన ప్రాజెక్ట్‌లకు ప్రొ జీవిఆర్ ప్రసాదరాజు, ప్రొ వి శ్రీనివాసులు, ప్రొ బిటి కృష్ణ, ప్రొ కె పద్మప్రియ, ప్రొ సిహెచ్ శ్రీనివాసరావు, ప్రొ జి స్వామినాయుడు, డా వివిఎస్ వకుళ, డా సిహెచ్ నీలిమా దేవి, డా వి జయప్రసాద్‌లు 9 పరిశోధనా ప్రాజెక్ట్‌లకు ప్రధాన పరిశోధకులుగా వ్యవహరిస్తారని జెఎన్‌టియుకె రూసా కో-ఆర్డినేటర్ ప్రొ ఎం స్వరూపారాణి తెలిపారు. రూసా 2.0 గ్రాంట్ క్రింద రీసెర్చ్ & ఇన్నోవేషన్ యొక్క పరిశోధన ప్రాజెక్ట్‌లు 01.06.2024 నుండి 30.05.2026 వరకు రెండు సంవత్సరాల పాటు మంజూరు చేయబడ్డాయన్నారు. జెఎన్‌టియుకె యూనివర్సిటీకి రూసా 2.0 గ్రాంట్ క్రింద నిధులు మంజూరు అయ్యేందుకు కృషి చేసిన రూసా కో-ఆర్డినేటర్ & ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ గ్రీవెన్సెస్ డైరెక్టర్ ప్రొ ఎం స్వరూపారాణిని ఉపకులపతి ప్రొ జీవిఆర్.ప్రసాదరాజు, అధికారులు, విభాగాధిపతులు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు: ఎమ్మెల్యే సత్తి

విశాలాంధ్ర - అనపర్తి : నియోజకవర్గ ఓటర్ల తీర్పు గౌరవిస్తున్నాని అదే విధంగా పార్టీ,నా విజయం కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తల వెంటే వుంటానని తెలిపారు. విజేతలకు సత్తి సూర్యనారాయణ రెడ్డి అభినందనలు తెలిపారు.

జ్యోతుల నెహ్రూకు నాయకుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర - గండేపల్లి : జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతు ల నెహ్రూకు గండేపల్లి మండల నాయకులు తన నివాసం వద్ద ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కనీవిని ఎరగని రీతిలో చరిత్ర సృష్టిస్తూ 52,775 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించడంతో జగ్గంపేట మం డలం ఇర్రిపాక గ్రామంలో జ్యో తుల నెహ్రూ స్వగృహంలో ఉదయం నుండి జన సునామీని తలపిస్తూ గజమాలతో, బొకేలతో, శాలువాలతో క్యూ కట్టి పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కోర్పు లచ్చయ్య దొర, జడ్పిటిసి సభ్యులు పరిమి బాబు, జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ, మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్, వైస్ ఎంపీపీ కుంచే రాజా, వెలమాటి కాశి, సుంకవిల్లి రమేష్, బత్తుల సత్తిబాబు, గుండా శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

9న జీ తెలుగులో డ్రామా జూనియర్స్ సీజన్ 7

విశాలాంధ్ర - తూర్పు గోదావరి: అత్యంత ప్రేక్షకాదరణ పొందిన జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ ప్రారంభం కానుందనీ సంస్థ ప్రతినిదులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా 6 సీజన్లు పూర్తిచేసుకున్న జి తెలుగు డ్రామా జూనియర్స్ 7వ సీజన్ ఈ నెల 9న, సాం౹౹ 6:00 గంటలకు! ప్రతి ఆదివారం రాత్రి 9:00 గంటలకు సారమవుతుందన్నారు. భావోద్వేగం నిండిన కథతో ప్రేక్షకుల హృదయాలను తాకే కథతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ మేఘసందేశం ఈ నెల 10 నుంచి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 7:30 గంటలకు!! ప్రసారం కానున్నదన్నారు. కొన్నేళ్లుగా అందరి హృదయాలను గెలుచుకున్న పాపులర్ కిడ్స్ రియాలిటీ షో ఏడో సీజన్ కోసం తెలుగు బుల్లితెరపైకి రీఎంట్రీ ఇస్తోందన్నారు. డ్రామా జూనియర్స్ సీజన్ 7కు కూడా సీనియర్ నటి జయప్రద జడ్జిగా కొనసాగనున్నారన్నారు. టాలీవుడ్ కమెడియన్, దర్శకుడు బలగం వేణు, అందాల నటి పూర్ణ కూడా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నారన్నారు. చిన్న పిల్లలను కళాకారులుగా ఎదగడానికి, ప్రేక్షకులను అలరించడానికి జీ తెలుగు అద్భుత అవకాశాన్ని అందిస్తోందన్నారు.ఇక ఈ సీజన్ కి ప్రముఖ నటుడు, నిర్మాత శ్రీరామ్ వెంకట్ వ్యాఖ్యాతగా, పడమటి సంధ్యారాగం సీరియల్ అధ్య, రామలక్ష్మి మెంటర్స్గా వ్యవహరిస్తున్నారు.

సర్వే చెప్పిందే నిజమైంది... కూటమి అభ్యర్థుల హర్షం

విశాలాంధ్ర - రాజానగరం : ఎన్నికల ఫలితాలను తమ సంస్థలు ద్వారా ఎన్నికల లెక్కింపు కంటే ముందుగా విశ్లేషించి అభ్యర్థుల గెలుపోటములు చెప్పే ప్రశాంత్ కిషోర్(పికె)నీ మించిన ఘనుడుగా కేకే సర్వే సంస్థ సీఈవో కుండేటి కిరణ్ నిలిచారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల నాగేశ్వరరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం మండలంలోని దివాన్ చెరువు గ్రామానికి చెందిన బత్తుల నాగేశ్వరరావు(నాగు) విశాలాంధ్రతో చర వాణిలో గురువారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్నికల ఫలితాలను క్షుణంగా పరిశీలించి ఎగ్జిట్ పోల్ ద్వారా బయట పెట్టిన కుండేటి కిరణ్ సర్వే అక్షరాలా నిజమైందన్నారు.ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్ ఫలితాలను మించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయాలు కైవసం చేసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఏపీలో ఫలితాలను కేకే సర్వే సంస్థ కరెక్ట్ అంచనా వేసింది. ఏపీలో జనసేన 21, బీజేపీ 7, టీడీపీ 133, వైసీపీ 14 అసెంబ్లీ స్థానాల్లో గెలుస్తాయని ముందుగా కెకె సర్వే సంస్థ అంచనా వేయడంతో కూటమి అభ్యర్థులు,నాయకుల్లో మరింత జోష్ పెరిగిందన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 19 స్థానాల్లో ఆసంబ్లి,మూడు పార్లమెంటు స్థానాలు కూటమి క్లీన్ స్వీప్ చేయడం హర్షణీయమనీ తెలిపారు.

పురందేశ్వరికి అభినందనలు

విశాలాంధ్ర-రాజమండ్రి: టీడీపీ, జనసేన బీజేపీ కూటమి తరఫున రాజమహేంద్రవరం నగర ఎంపీగా విజయం సాధించిన పురందేశ్వరిని జనసేన పార్టీ రాజమండ్రి సిటీ ఇన్చార్జి శ్రీ అను శ్రీ సత్యనారాయణ ప్రత్యే కంగా కలిసి సాలువాతో, పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి, అను శ్రీ లకు మరియు అనుశ్రీ కార్య వర్గానికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యక్షులు గుత్తుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నల్లంశెట్టి వీరబాబు, సిటీ కార్యదర్శులు గుణ్ణం శ్యాంసుందర్ , అల్లాటి రాజు విన్నావాసు సిటీ సంయుక్త కార్యదర్శి వట్టికుట్టి వేణుగోపాల్ కృష్ణ, జనసేన నాయకులు ఇంద్ర విజయ్ పాల్గొన్నారు.

మాగ్నిఫ్లెక్స్ ఇండియా నుంచి మాగ్నిజియో ఆవిష్కారం

విశాలాంధ్ర-భీమవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, విలాసవంతమైన పరుపుల బ్రాండ్ అయిన మాగ్నిఫ్లెక్స్ పర్యావరణ సుస్థిరతకు ప్రాధాన్యతనిస్తూ అత్యుత్తమ సౌకర్యాన్ని అందించే మాగ్ని జియో ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా మాగ్నిఫ్లెక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ నిచాని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నఉష్ణోగ్రతలు, పర్యావరణ క్షీణతతో భూగోళం నేడు క్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటూ కీలక దశలో ఉందని, మాగ్నిజియో ఆవిష్కారంతో, మాగ్నిఫ్లెక్స్ ఇండియా మరింత సుస్థిర భవిష్యత్తు వైపు ప్రయాణంలో కీలక ఘట్టాన్ని సూచిస్తుందన్నారు. మాగ్నిజియో ప్రతీ కొనుగోలుపై కొనుగోలుదారు తరఫున మాగ్నిఫ్లెక్స్ ఒక మొక్కను నాటనుందని, అంతేగాకుండా కొనుగోలుదారు పేరు లేదా వారి నామినీ పేరు మీద సర్టిఫికేట్ జారీ చేస్తుందన్నారు. "వృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు, వినూత్నతలను ప్రోత్సహించడానికి, కస్టమర్ సంతృప్తిని నిర్ధారించడానికి మాగ్నిఫ్లెక్స్ కట్టుబడి ఉందన్నారు. ప్రతి కొనుగోలుదారు విభిన్న అవసరాలను తీర్చే ప్రీమియం స్లీప్ సొల్యూషన్‌ల విస్తృత శ్రేణిని అందిస్తున్నందుకు మేం గర్విస్తున్నాం. మాగ్నిజియోతో మేం స్లీప్ సొల్యూషన్స్ తీసుకువచ్చామన్నారు. ఇది సౌకర్యాన్ని అందించడమే కాకుండా పర్యావరణ బాధ్యతను కూడా నెరవేరుస్తుంది" అని అన్నారు.

ఆదిత్యలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ కుమార్. వైస్ ప్రిన్సిపాల్ విజయ భార్గవి, విభాగాధిపతి గోవర్ధన్ రెడ్డి, ఆదిత్య విద్యా సంస్థలోని బిజినెస్ స్కూల్, అధ్యాపక బృందం మరియు ఆఫీస్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొని మొక్కలు నాటారు.

అదేవిధంగా : ఆదిత్య డిగ్రీ ,పీజీ కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ విభాగం నందు జాతీయ సేవా పథకం యూనిట్ కమిటీ ఆధ్వర్యంలో సూరం పాలెం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అక్కడ ఉన్న బాల బాలికలకు మొక్కలు యొక్క ప్రాముఖ్యతను, ప్రాధాన్యత గురించి కళాశాల ప్రధాన ఉపాధ్యాయులు వివరించారు. జాతీయ సేవా పథకం వాలంటీర్లు ప్రదర్శన ద్వారా పర్యావరణానికి మొక్కలు యొక్క పాత్రను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానోపాధ్యాయుడు విలాస్ అనిల్ చావన్, ఉపాధ్యాయులు పివి నాగేశ్వరరావు, జాతీయ సేవా పథకం కో ఆర్డినేటర్ బికె విద్యాసాగర్ మరియు వాలంటీర్లు, అధ్యాపక బృందం పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

యానాంలో మల్లాడి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - యానాం : యానాంలో గురువారం ఉదయం పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 61వ జన్మదిన వేడుక అత్యంత ఘనంగా మల్లాడి అభిమాన సంఘం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పుదుచ్చేరి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు. యానాం కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 61వ జన్మదిన వేడుకను స్థానిక యర్ర గార్డెన్స్‌లో మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో 61వ పుట్టినరోజు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి, హెూం మంత్రి నమశ్శివాయః, ప్రజా పనుల శాఖ మంత్రి లక్ష్మీ నారాయణ, స్పీకర్ సెల్వం, పలువురు ఎమ్మెల్యేలు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్ర బోస్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మరి కొంతమంది నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ అనురాధతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున రాజకీయ ప్రముఖులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రంగస్వామితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు మల్లాడి కృష్ణారావు చేసిన సేవలను గురించి మాట్లాడారు. అనంతరం భారీ కేక్ కటింగ్ నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ఉదయం మల్లాడి సగృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలలో మల్లాడి కృష్ణారావు ఆయన సతీమణి ఉదయలక్ష్మి, కుమారుడు వంశీ దంపతులు పూజలలో పాల్గొనగా, వేదపండితులు లక్ష్మీ గణపతి హెూమం, ఆయుష్ హెూమాన్ని శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ప్రవచనా చక్రవర్తి డాక్టర్ చాగంటి కోటేశ్వ రరావు ప్రవచనంతో వేడు కలను ప్రారంభించారు. పెద్ద ఎత్తున రాజకీయ ప్రముఖులు, పుర ప్రజలు తరలిరా వడంతో సభా ప్రాంగణం జన సమూహంతో కిక్కిరిసిపోయింది. గజమాలలు పుష్ప గుచ్ఛాలతో అభిమానులు మల్లా డిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియ జేశారు. మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యం లో ఈ వేడుకలకు హాజరైన పుర ప్రజలకు నూతన దుస్తులు, మల్టీ పర్పస్ పెన్నులను అందజేశారు. ఒక సమయంలో పెద్ద ఎత్తున అభిమానులు ఎగబడటంతో కట్టడం చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతోపాటు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి రాజకీయ ప్రముఖులు వివిధ పార్టీల నాయకులు, నూతనంగా ఎంపికైన ప్రజా ప్రతినిధులు ఈ వేడుకలలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుచ్చిబాబుకు బీజేపీ నాయకుల సన్మానం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు)ను మురమళ్ళ వారి స్వగ్రహం వద్ద డాక్టర్ బిఆర్ కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బాబీ మాస్టారు, జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ, నియోజకవర్గ కన్వీనర్ గొల కోటి వెంకటరెడ్డి, కాట్రేనికోన మండల అధ్యక్షుడు మట్ట సూరిబాబు, గాలి దేవర గంగాధర్, శివాజీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు సన్మానించారు.

అభివృద్ధిలో ముందుంటాం...

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కొయ్యలగూడెం పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉప్పాడ పెద్దిరెడ్డి ఏలూరులోని ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ముందుంటానని ఆయన తెలిపినట్లు పెద్దిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఎరుకుల సంఘం అధ్యక్షుడు పోలా రామకృష్ణ, నూతంగి మహేష్, బొబ్బర రమేష్, బబ్లు, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్ళరేవు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అమలాపురం పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు పుట్టినరోజును తాళ్ళరేవు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, కేక్‌లను కట్ చేసి తినిపించారు, అనంతరం వీరబాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకట రమణ (బాబి), తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, మందాల గంగ సూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, తాళ్ళరేవు మండల మహిళా అధ్యక్షురాలు వెంటపల్లి ఉమామహేశ్వరి, యస్సీ సెల్ అధ్యక్షుడు మోర్త భైరవమూర్తి, జక్కల ప్రసాద్, నిమ్మకాయల మూర్తి, టేకుమూడి వీర వెంకట సత్యనారాయణ, గండి అప్పారావు, శీకాల సత్తిబాబు, దేవా, దుర్గా ప్రసాద్, తాతీలు, నూకరాజు, మల్లాడి గోవ రాజు, నాగబాబు, సీతారామరాజు, సూరిబాబు, కుమార్ పాల్గొన్నారు.

కెయూ బీ ఫార్మసీ పరీక్షా ఫలితాలు విడుదల

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : కృష్ణా విశ్వవిద్యాలయం బీ ఫార్మసీ ఎనిమిదవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి గురువారం విడుదల చేసారు. విశ్వవిద్యాలయం, అను బంధ కళాశాలల్లో 207 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 178 మంది ఉత్తీర్ణులు కావడంతో 85.99 ఉత్తీర్ణత శాతం నమోదయ్యింది. 19 మంది సప్లమెంటరీ విద్యార్థులు పరీక్షలు కు హాజరు కాగా 68.42 ఉత్తీర్ణత శాతం సాధించారు. ఈ సందర్భ ముగా ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి , రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం అధికారులు, సిబ్బందిని అభినందించారు.

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థులు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో రెండు ఉన్నత పాఠశాలల్లో ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్స్ స్కాలర్‌షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్) కు ఎంపికైనారు. వీరికి 2024-25 విద్యాసంవత్సరం లో 9వ తరగతి నుంచి వరుసగా నాలుగు సంవత్సరాలు ఉపకార వేతనాలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుంది. 2023-24 విద్యా సంవత్సరంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ మెరిట్ స్కాలర్షిప్ లభించింది. వీటిల్లో కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థిని శీలం లిల్లిమ్మ(ఎస్టి) ఎంపికైనట్లు హెచ్ఎం నెమ్మాని శేష సాయికుమార్ గురువారం తెలిపారు. మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి చలమలశెట్టి తేజ భవాని శ్రీ మోహన్ సాయి,(102 మార్కులు), దర్శివర్షిని (88 మార్కులు) సాధించి ఎన్ఎంఎంఎస్ ఎంపికేనట్లు ఆ పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయురాలు సూర్యదేవర శ్రీదేవి తెలిపారు.

పంటలకు ఊపిరి పోసిన వర్షం

విశాలాంధ-కూచిపూడి : మొవ్వ మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకుఉరుములు పిడుగులు,తో పాటు విస్తృతమైన గాలులతో కురిసిన వర్షం తో మెట్టపైరులకు ఊపిరి ఇచ్చింది. రోహిణి కార్తె లో భారీగా కురిసిన వర్షం15.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ప్రస్తుతం మెట్టపొలాలలో సాగవుతున్న కూరగాయల తోటలు కు ఈ వర్షం మంచిదేనని పలువురు రైతులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పుడిప్పుడే మొక్కపెరుగుతూ తీగలు వేస్తున్న బీర తోటలకు కొంత ఇబ్బందికరమేనని పేర్కొంటూ రైతులు పైపుల ద్వారా నీటిని బయటకు తీసుకున్నారు. గత నెల 25వ తారీకు ప్రారంభమైన రోహిణి కార్తె లో కురుస్తున్న వర్షాలతో పలువురురైతులు వరి విత్తనాలనువెదజల్లుకోవటం ప్రారంభించారు, అలాగేకొంతమంది రైతులు వరినారుమడులు పోసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగానే ఉంటుందని పలువురు రైతులుపేర్కొంటున్నారు. ఈ వర్షంమూలంగా రోడ్డుపై గోతులలో నీరు నిలిచి రహదారులు ఇబ్బందికరంగా మారాయి. కూచిపూడి, పెదపూడి, యద్దనపూడి, పెదసనగల్లు, భట్లపెనుమర్రు, మొవ్వ, కాజ, కారకంపాడు నుంచిపెదముత్తేవి, తదితర రహదారులపై గల గోతులు వాహనదారులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారాయి.

ఎన్డీఏ కూటమితో అధికార పార్టీ గల్లంతు

విశాలాంధ్ర - కలిదిండి : ఎన్డీఏ కూటమి సునామీలో అధికార పార్టీ గల్లంతైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఆంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని మట్టగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఎన్నడు లేని విధంగా తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి చారిత్రత్మక విజయం సాధించిందని అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు సమయంలో మద్దతు ఇచ్చి కూటమి గెలుపులో కీలక పాత్ర వహించిన పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం ద్వారా రాజధాని అమరావతి, పోలవరం లాంటి సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసి వైస్ చైర్మన్ నాగిడి వీరబ్రహ్మం, టీడీపీ నాయకులు ఆంద్రాజు దుర్గారావు, ఒడుగు గణపతి, కోకా తాతయ్య, నల్లమోతు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిఎన్నార్ డిగ్రీ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర- భీమవరం: డిఎన్నార్ అటానమస్ కళాశాల 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను డిఎన్నార్ విద్యా సంస్థల సెక్రెటరీ కరస్పాండెంట్ గాది రాజు బాబు, ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విద్యార్థులు బి.ఎ., బి.ఎస్సీ, బి.కాం(జనరల్), బి.కాం (కంప్యూటర్స్), బి.బి.ఎ., బి.కాం (ఒకేషనల్) కోర్సుల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ఆనందం వ్యక్తం చేశారు. మిగతా సెమిష్టర్ పరీక్షల్లో బి.ఎ., 75 శాతం, బి.ఎస్సీ., 70 శాతం, బి.కాం(జనరల్) 73 శాతం, బి.కాం (కంప్యూటర్స్) 75 శాతం, బి.బి.ఎ 71 శాతం బి.కాం(ఒకేషనల్) 69 శాతం సాధించారని వారు తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఉత్తమ విద్యా బోధనే లక్ష్యంగా ముందుకు సాగుతూ ఎందరో మేధావులను సమాజానికి అందించిన ఘనత తమ కళాశాలకే దక్కిందని వారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 309 మంది విద్యార్థులకు పేరొందిన సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించామని వారు గుర్తు చేశారు. తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ సాదనకు కావలిసిన అన్ని రకాల సదుపాయాలను తమ కళాశాల యాజమాన్యం ఖర్చుకు వెనుకాడకుండా విద్యార్థులకు కల్పిస్తున్నదని అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తమ కళాశాల యాజమాన్యం చేస్తున్న కృషి మరువలేనిదని, విద్యార్థులకు నేటి టెక్నాలజీకి అనుగుణంగా క్రొత్త కోర్సులు ప్రవేశ పెట్టి తమ కళాశాల విద్యార్థులకు అనేక రంగాలలో అభివృద్ధి సాధించుటకు అవకాశం కల్పిస్తున్నదని అన్నారు. కళాశాల పాలకవర్గ సభ్యులు పి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ కళాశాలలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం షార్టు టర్మ్, లాంగ్ టర్మ్ ఇంటర్న్ షిప్, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్స్ లను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషారాణి, సి.హెచ్.జె.సోమరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జానినేషన్స్ డి.శ్రీనివాస రాజు అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వి.చంద్ర శేఖర్, కె.సంతోష్, ఎగ్జామినేషన్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిర్రి బాలరాజుకు అభినందనలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గ శాసన సభ్యునిగా నూతనంగా ఎన్నికైన చిర్రి బాలరాజును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి మహిళా నాయకులతో కలిసి గురువారం ఆయన నివాసం వద్ద ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కొయ్యలగూడెం మండల అభివృద్ధికి కృషి చేయాలని మేఘలాదేవి చిర్రి బాలరాజును కోరారు. ఈ ఐదు సంవత్సరాల పదవి కాలంలో నియోజకవర్గంను అభి వృద్ధి చేస్తానని నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని బాలరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు దొట్టపనేని దుర్గాదేవి, కొత్త రమ, నల్లపర్తి ఝాన్సీ రాణి, సిర్ర ఉమా, కర్రి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రైతన్నల సాయం మరువబోము

విశాలాంధ్ర - చింతలపూడి : తెలుగుదేశం మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించడం కోసం జిల్లాలో రైతన్నలు చేసిన సాయాన్ని మరువబోమని తెలుగు రైతు ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరరావు మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం చింతలపూడి మండలం శివపురం గ్రామాల్లోని గుత్తా వెంకటేశ్వరరావు నివాసంలో వారు మాట్లాడుతూ జిల్లాలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం వీరోచితంగా పని చేసిన తెలుగు రైతు నాయకులు కార్యకర్తలకు వారు అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు 27 మండలాలు 287 గ్రామాలలో టిడిపి గెలుపు కోసం మిత్రపక్షాల గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి జిల్లా కమిటీ అభినందనలు తెలియజేస్తుంది అన్నారు. తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్య వైఖరి వలన జిల్లాలో మెట్ట ప్రాంతానికి వరప్రదాయిని అయిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో వదిలేశారని గుర్తు చేశారు.

పద్మ అవార్డులకు దరఖాస్తులు

విశాలాంధ్ర -భీమవరం: క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరచిన క్రీడాకారుల నుండి పద్మ విభూషణ్ , పద్మ భూషణ్, పద్మ శ్రీ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానించుచున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రతినిధి ఎ.రాజేష్ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల క్రీడాకారులు తమ దరఖాస్తులను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పద్మ అవార్డ్స్.గవ్.ఇన్ వెబ్ సైట్ నందు క్రీడాకారులు వ్యక్తిగతముగా దరఖాస్తు చేసుకొని 01.08.2024 లోగా వాటి నకలు పత్రములను రాష్ట్ర ప్రభుత్వం ద్వార ప్రతిపాదించదలిస్తే తమ నిర్ణీత దరఖాస్తును స్పోర్ట్స్ ఇన్ఏపిఏజిమెయిల్.కమ్, లేదా ఇన్సెంటివ్స్. స్కీమ్స్ఏజిమెయిల్.కమ్‌లకు మెయిల్ ద్వారా పంపవలసినదిగా కలెక్టరేట్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఉత్తుత్తి ఇళ్ల స్థలాల జీవోతో మోసపోయిన జర్నలిస్టులు

విశాలాంధ్ర - అన్నవరం : రాష్ట్రంలో అన్ని వర్గాలతో పాటు జర్నలిస్టులను కూడా మోసం చేసిన ఘనత గత ప్రభుత్వానికే చెల్లింది అని పలువురు జర్నలిస్టులు పేర్కొంటున్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీని జగన్ ప్రభుత్వం నెరవేర్చలేదు. ఉత్తుత్తి జీవో 535తో అరిచేతిలో స్వర్గం చూపించారు. ఎన్నికలకు 6 నెలల ముందు జరిగిన క్యాబినెట్ సమావేశంలో జర్నలిస్టులకు 3 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని నిర్ణయించారు. దాంతో పొంగిపోయిన జర్నలిస్టులు జగన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు, పూలాభిషేకాలు చేసి పార్టీ కార్యకర్తల స్థాయికి దిగే విధంగా వారిని పక్కదారి పట్టించారు. రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టు సంఘాల నేతలు ఎవరూ మంత్రి వర్గ నిర్ణయం పై తక్షణమే స్పందించకపోయేసరికి ప్రభుత్వ పెద్దలు అధికారులపై రుస రుసలాడారు. దాంతో సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హుటాహుటిన కొంత మంది జర్నలిస్టు సంఘాల నాయకులను, పలు మీడియా సంస్థల బ్యూరో చీఫ్‌లను పని గట్టుకుని సీఎం ఆఫీస్‌కు పిలిసి అభినందనలు తెలిపే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆహా..ఓహెూ..అంటూ కీర్తించారు. ఆ తర్వాత రెండు రోజుల్లో గత నవంబర్ 11న, అనేక షరతులతో జీవోనెం.535 రావడంతో పాటు భూమి ధర 60:40 నిబంధన పెట్టడంతో జర్నలిస్టులంతా ఢీలా పడ్డారు.

సొంతంగా గానీ ప్రభుత్వం నుండి గాని కొద్దిపాటి స్థలం, ఇల్లు పొంది ఉన్న అర్హత లేదని నిబంధన సవరణ చేయాలని, రేటు తగ్గించాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిస్తే లీగల్ సమస్యలు వస్తాయని, సొంత స్థలం, ప్రభుత్వ స్థలం ఉన్నా లేవని తెలుపుతూ ఆన్లైన్ దరఖాస్తులు నింపండని తప్పుడు సలహా ఇచ్చారు. దీన్నే అనుసరించిన జర్నలిస్టుల పేర్లు రాష్ట్రంలో చాలాచోట్ల ప్రాథమిక లిస్టులో చేర్చలేదు. దరఖాస్తులు పరిశీలన కొన్ని చోట్ల రెవెన్యూ అధికారులకు అప్పగించడంతో ఈ సమస్య ఎదురయింది. ఎన్నికలకు ముందే ఏది ఏమైనా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదు. అలాంటి సహకారం సజ్జల రామకృష్ణారెడ్డి నుండి గాని, సీఎంఓ నుండి గాని రాలేదు. జనవరి 8వ తేదిన ఒకే ఒకసారి సీఎంఓ నుండి కలెక్టర్లకు సూచనలు వచ్చినప్పటికీ రాష్ట్రంలో ముగ్గురు కలెక్టర్లు తప్ప మిగతారెవరు వాటిని పట్టించుకోలేదు. విశాఖపట్నం, కాకినాడ, చిత్తూరు జిల్లాల నుండి మాత్రమే ఫైళ్ళు సీసీఎల్ఏకు వెళ్లాయి. అవి కూడా అసమగ్రంగా ఉన్నాయి. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల భూసేకరణ కోసం రూ.150 కోట్లు విడుదల చేయాలని సిసిఎల్ఏ ఆర్థిక శాఖకుజనవరి 8వ తేదిన పంపిన ఫైలు నెం.1157/2023ను తిరస్కరించారు. ఏ జిల్లాలో ఎంత భూమి కావాలి..,ఎంతమంది జర్నలిస్టు లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వ భూములు లేవా. ఎంత నిధులు అవసరం తదితర..అంశాలపై ఆర్థిక శాఖ అడిగిన వివరాలను సీసీఎల్ ఏ ఆర్థిక శాఖకు ఇవ్వలేకపోయింది. ఫిబ్రవరి నెలలో సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జి సాయిప్రసాద్ ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీకి మరో ఫైలు నెం.22021/19/2024ను ఫిబ్రవరి 16న పంపించారు. రూ.150 కోట్లు విడుదలకు ఆర్థిక శాఖ అభ్యంతరం చెబుతుందని, జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాల కొరకు ప్రభుత్వ భూములు రాష్ట్రంలో ఎక్కడా లేవని, ప్రైవేటు భూములు కొని మాత్రమే ఇవ్వాలని రాశారు. వేలాది ఎకరాల భూములు పేదల ఇళ్ళ పథకానికి కేటాయించామని ఆ ఫైలు సారాంశం ప్రభుత్వ భూములు లేవనేది పచ్చి అబద్ధం. గోదావరి జిల్లాలలో అక్కడక్కడ ప్రభుత్వ భూములు లేకపోవచ్చు కానీ, ఉత్తరాంధ్రతో పాటు అనేక జిల్లాల్లోనూ జర్నలిస్టులకు సరిపడా ప్రభుత్వ భూములు ఉన్నాయి. అన్ని జిల్లాల కలెక్టర్ల నుండి ప్రతిపాదిత ఫైళ్లను సీసీఎల్ ఏకు రప్పించడంలో విఫలమైంది. దానికి తోడు ఎన్నికలు దగ్గర పడుతున్నాయి మాకెందుకులే అనే ధోరణిలో కలెక్టర్లు ఇతర అధికారులలో ఉంది. సొంత స్థలం ఉన్నప్పటికీ, ప్రభుత్వ పథకం క్రింద స్థలం పొందినప్పటికీ వాటిని రద్దు చేసుకొని మూడు సెంట్లు పొంద విధంగా జీవో తెస్తున్నామని చివరకు చేతులెత్తేశారు.

ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ ప్రభుత్వ పెద్దల మాయల మాత్రం ఎక్కడ ఆగలేదు. ఎన్నికల నోటిఫికేషన్ స్థలాల కేటాయింపుకు అడ్డు కాదంటూ మళ్లీ మాయ మాటలు చెబుతూ వచ్చారు. ఎన్నికలు అయిపోయినా స్థలాలు కేటాయింపు జరగలేదు. జిల్లాలలో లబ్ధిదారులు ఎంపిక, ఫైళ్ల తయారు, భూసేకరణ పూర్తి, నిధులు కేటాయింపు లాంటివేమీ జగగకుండా స్వస్తి చెప్పారు. ఎలాగైతేనే జర్నలిస్టులకు ఇవ్వకూడదని నిర్ణయమే పై చేయి అయింది. పోరాడితే తప్ప ప్రాధేయ పడితే స్థలాలు రావనే సత్యాన్ని జర్నలిస్టులు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో మరోసారి మోసపోకుండా జర్నలిస్టుసంఘాలు పట్టు బిగిస్తే పరిష్కారం దొరుకుతుందని జర్నలిస్టులు భావిస్తున్నారు.